ఆరోగ్యకర నారుతో అధిక దిగుబడి

- మెరకలో ఉండి సారవంతంగా..
- 'జగ్గయ్యపేట'లో 5 వేల ఎకరాల్లో వరి సాగు
- అప్రమత్తంగా ఉండాలి


పెనుగంచిప్రోలులో వరి నారుమడి

పెనుగంచిప్రోలు: ఆరోగ్యకర నారుతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రబీ సాగుకు రైతులు వరి నారు పోస్తున్నారు. వరి సాగులో ఖర్చు తక్కువ, దిగుబడులు పెంచుకోవడానికి ఆరోగ్యకర నారు కీలకం. నారుమడిని ఆరోగ్యకరంగా పెంచడానికి నేల తయారీ నుంచి ఎంతో జాగ్రత్త అవసరం. నియోజకవర్గంలో 5 వేల ఎకరాల్లో సుమారు 2100 మంది రైతులు వరి సాగు చేస్తున్నారు. వరి పైరు నారుమడులు, కలుపు యాజమాన్యం, సస్య రక్షణ పద్ధతులను వ్యవసాయ శాఖ ఏడీ భవాని వివరించారు. నారుమడి వేయడానికి ఎంచుకున్న నేల పొలానికి ఎల్లప్పుడూ మెరకలో ఉండి సారవంతమైంది కావాలి. వేసవిలో పొలాన్ని దున్ని కలుపు లేకుండా ఉంచుకోవాలి. వీలైనంత వరకు బాగా చివికిన సేంద్రియ ఎరువులను ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నుకోవాలి. మొక్కకు కావాల్సిన అన్ని పోషకాలు అంది నారు ఆరోగ్యంగా పెరుగుతుంది. నారుమడిని10-12 రోజుల వ్యవధిలో 3 సార్లుగా దమ్ము చేసి చదును చేసి, నీరు పెట్టటానికి, తీయటానికి వీలుగా కాలువలు తీసుకోవాలి.

విత్తడం

ఐదు సెంట్లు నారుమడి ఒక ఎకరానికి సరి పోతుంది. లీటరు నీటికి గ్రాము చొప్పున కార్బండిజమ్ కలిపిన ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి. మెట్ట నారుమడికి కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్‌ను కలిపి 24 గంటల తర్వాత నారు మడిలో చల్లుకోవచ్చు.

పోషక యాజమాన్యం

ఎకరం నారుమడికి 6 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్, 1.5 కిలోల మ్యూరేట్ పొటాష్ ఎరువులను దమ్ములు చేసేటప్పుడు వేసుకోవాలి. 2 కిలోల యూరియాను విత్తనం చల్లే ముందు మరో కిలో విత్తిన 12-14 రోజులకు వేసుకోవాలి. నారు దృఢంగా పెరిగి విత్తుకోవడానికి వీలవుతుంది. ఇనుప ధాతు లోప నివారణకు లీటరు నీటిలో 20 గ్రాముల అన్నభేది, 2 గ్రాముల నిమ్మఉప్పు కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

మెట్ట నారుమడి..

విత్తిన వెంటనే 2, 3 రోజుల్లో మెట్ట నారుమడిలో కలుపు నివారణకు విత్తనాలు చల్లి భూమిలో కలిపి(విత్తనం మడి మీద కనిపించరాదు)తడిపిన తరువాత వెంటనే ఎకరం వైశాల్యం ఉన్నవారు మడిలో పెండిమిథాలిన్ 30 శాతం ద్రావకం(లీటరు నీటికి 5మి.లీ చొప్పున) వాడుకోవాలి. లేదా ఎకరాకు 400 మి.లీ ప్రిటిలాక్లోర్ 50 శాతం ద్రావకం(అనగా లీటరు నీటికి 2 మి.లీ చొప్పున)ఏదో ఒకదానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మందు స్ప్రే చేసిన 2,3 రోజుల వరకు తడి పెట్టకూడదు. నారు విత్తిన 15వ రోజున నారుమడిలో గడ్డిజాతి మొక్కలు మాత్రమే ఉంటే ఎకరా వైశాల్యానికి 400 మి.లీ సైహలోపాప్ భ్యూటైల్ 10 శాతం ద్రావకం 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి. (అనగా లీటరు నీటికి 2 మి.లీ చొప్పున). అన్ని రకాల కలుపు మొక్కలు ఉన్నప్పుడు ఎకరా వైశాల్యానికి 80 మి.లీ బిస్పైరిబాక్ సోడియం 10 శాతం ద్రావకం 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి.(అనగా లీటరు నీటికి 0.4 మి.లీ చొప్పున).

సస్యరక్షణ

విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాములు చొప్పున వేసుకోవాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ, లేదా క్లోరిపైరిపాస్, 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి విత్తిన 10 రోజులకు , 17 రోజులకు పిచికారీ చేసుకోవాలి. లేదా నారు తీయటానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాములు కార్బోఫ్యూరాన్3 జీ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచి చల్లుకోవాలి.

కలుపుమందు వాడకంలో జాగ్రత్తలు

సిఫార్సు చేసిన మందును మోతాదులో, సిఫార్సు చేసిన సమయంలోనే వాడాలి. లేకపోతే నష్టం కలుగుతుంది. మందు స్ప్రే చేసిన తర్వాత 2 రోజుల వరకు నీరు పెట్టకూడదు. భూమి పొడిగా ఉన్నప్పుడు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు రసాయన మందులు స్ప్రే చేస్తే మంచి ఫలితాలు రావు.

కలుపు యాజమాన్యం.. రసాయనాలతో నివారణ

సాధారణంగా చిన్న కమతాల వారు నారుమడికి మనుషులతో కలుపు తీయించుకోవచ్చు. కూలీల సమస్య అధికంగా ఉన్నప్పుడు పెద్ద కమతాల వారు నారుమడులకు రసాయనాలతో కలుపు నివారించుకోవచ్చు. విత్తిన 3 నుంచి 5 రోజుల్లో మడిలో నీరు పలచగా ఉన్నప్పుడు ఎకరం వైశాల్యంలో ఉన్న నారుమడికి 35 గ్రాములు ఆక్సాడయార్జిల్ 80 శాతం ముందుగా అర లీటరు నీటిలో కలిపి ఆ ద్రావణాన్ని 20 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో సమానంగా చల్లాలి. మందు చల్లిన రెండు రోజుల వరకు నీరు పెట్టకూడదు. నారుమడి విత్తిన 15వ రోజు పొలంలో కేవలం ఊద మొదలుగు గడ్డిజాతి మొక్కలే ఉంటే ఎకరాకు 400 మి.లీ సైహలోఫాస్ భ్యూటైల్ 10 శాతం ద్రావకం 200 మి.లీ నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి(అనగా లీటరు నీటికి 2మి.లీ. చొొప్పున). ఈ మందు స్ప్రే చేసిన వారం రోజుల్లో ఊద, గడ్డిజాతి మొక్కలు మాత్రమే నశిస్తాయి.

కుక్క స్వైరవిహారం

నలుగురికి గాయాలు


కుక్కదాడితో గాయపడిన షేక్ అర్ఫా

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో అన్నివార్డుల్లో వీధి కుక్క స్వైరవిహారం చేస్తూ ఆదివారం నలుగురిని గాయపరిచింది. డాంగేనగర్‌లోని పెద్దాయన వీధిలో సాయంత్రం ట్యూషన్‌కు బయలుదేరిన నాలుగేళ్ల షేక్ అర్ఫాను వీధికుక్క దాడిచేసి గాయపరిచింది. అదేవిధంగా ఈరోడ్డులో మరో ముగ్గురిని కూడా గాయపరిచింది. దీంతో బాలికను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పట్టణంలోని ప్రతి వీధిలో 10 నుంచి 15 కుక్కలు ఉంటూ స్వైరవిహారం చేస్తున్నాయని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఇళ్లల్లోంచి బయటకు రావాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలో 1000కిపైగా వీధికుక్కలు ఉన్నా, తరచూ జనాన్ని గాయపరుస్తున్నా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల బారి నుంచి తమను కాపాడేందుకుందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నందిగామ టౌన్: రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పాలన సాగుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 31 మందికి మంజూరైన రూ. 31.91 లక్షల చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఆమె లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తహసీల్దార్ జాహ్నవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిష్కార వేదికలో గ్రామాల్లో సమస్యలుంటే ప్రజలు అర్జీలు దాఖలు చేసుకోవచ్చని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ఏసు మార్గంలో పయనించాలి



కంచికచర్ల: ప్రతి ఒక్కరూ ఏసు క్రీస్తు మార్గంలో పయనించాలని సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ కొండా స్టాలిన్ అన్నారు. మండలంలోని గండేపల్లిలో పాస్టర్ స్టాలిన్ ఆదివారం రాత్రి క్యాండిల్ సర్వీస్ చేశారు. సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు, స్త్రీల మైత్రీ సభ్యులు, చిన్నారులు క్యాండిల్ సర్వీస్‌లో పాల్గొన్నారు. దయామయుడు ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపేలా స్తుతి గీతాలు ఆలపిస్తూ ప్రత్యేక ప్రార్థన చేశారు. కార్యక్రమంలో సంఘ కమిటీ సభ్యులు బొక్కా రవికుమార్, కల్పన, మందా అనూష, స్త్రీల మైత్రీ సభ్యులు పాల్గొన్నారు.

షటిల్ టోర్నీ ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో పాత ఎస్‌ఎస్‌వీ కాలనీలోని గ్రౌండ్‌లో ఫ్రెండ్స్ రిక్రియేషన్స్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన షటిల్ టోర్నమెంట్‌ను ఆదివారం సీఐ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే టోర్నమెంట్‌లో షటిల్ క్రీడను మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ గుంటక లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జగ్గయ్యపేట ప్రాంతంలో షటిల్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ పోటీలు నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ రిక్రియేషన్స్ సభ్యులను అభినందించారు. స్థానిక తపోవన్ విద్యాలయం ఉపాధ్యాయుడు, రిక్రియేషన్స్ సభ్యుడు రాజకిషోర్ నాని ఆర్థిక సాయంతో ఏర్పాటుచేసిన పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే టోర్నీలో మొత్తం 45 టీములు పాల్గొంటాయని తెలిపారు. సంస్థ వ్యవస్థాపకుడు, న్యాయవాది ఆరేపల్లి వెంకటేశ్వర్లు, ఆర్టీసీ హనుమంతరావు, టీచర్ పెసరమిల్లి వెంకటేశ్వరరావు, పీఈటీ ఉపేంద్ర, తోకల లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎల్ బుక్ ఆవిష్కరణ



జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జగ్గయ్యపేట వారి ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన నూతన సంవత్సరం-2025 కానుక సెలవు దరఖాస్తు పుస్తకం(సీఎల్ బుక్)ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివారం మున్సిపల్ మాజీ చైర్మన్, ఎస్ఎస్ఆర్ జ్యూయలర్స్ అధినేత శ్రీరాం సుబ్బారావు షాపులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీఎల్ బుక్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎం.శ్రీహరి, రాష్ట్ర కౌన్సిలర్ టీవీఎల్.నరసింహారావు, పేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాజేంద్ర, జె.వెంకటేశ్వర్లు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



జగ్గయ్యపేట అర్బన్: తోటి వారిని ప్రేమించడమే ఏసుక్రీస్తు లోకానికి చూపిన మార్గమని ఎంఈవో ఎల్.చిట్టిబాబు అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ ఆర్‌సీఎం యూపీ స్కూల్లో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఈవో చిట్టిబాబు కేక్ కట్ చేసి.. విద్యార్థినులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు, క్రిస్మస్ గీతాలు అలరించాయి. స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): లయన్స్ క్లబ్ వీఆర్కే నగర మహిళ సంస్థ ప్రోత్సాహంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు అన్నారు. కొండపల్లిలో ఆదివారం లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా వీఆర్కే నగర మహిళ సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తిచేసిన 90 మంది మహిళలకు కుట్టు మిషన్లు, 10 మంది బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ దేవినేని జోనీకుమారి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

రామానుజన్ స్ఫూర్తితో గణితంలో రాణించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులు గణితంలో రాణించాలని పలువురు అతిథులు పేర్కొన్నారు. శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్య అకాడమి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు ప్రదర్శించిన గణిత శాస్త్ర నమూనా ప్రాజెక్టులను తల్లిదండ్రులు, సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. అతిథులు న్యాయవాది కేజేఎస్ ప్రకాష్, ఏబీసీడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అడ్వకేట్ ఆవుల వెంకట్రావు మాట్లాడుతూ గణితంలో గొప్ప తనాన్ని సాధించాలంటే రామానుజన్ మాదిరిగా సబ్జెక్టుపై లోతైన ఆలోచనలు చేయాలని సూచించారు. ఆయన 13వ ఏటనే అధునాతన సిద్ధాంతాలను కనుగొన్నారని చెప్పారు. సుమారు 3900 గణిత ఫలితాలను రాబట్టారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, రేమల్లె గోపాలం, దారా నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూచిపూడి తరుణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు రూపొందించిన గణిత శాస్త్ర నమూనాలతో అతిథులు


విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న నిర్వాహకులు

జాతీయ గణిత దినోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: గణిత మేధావి శ్రీనివాస రామానుజం 137 వ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం ఆదివారం స్థానిక జేఆర్‌సీ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. జేఆర్‌సీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, విశ్వభారతి కళాశాల ప్రిన్సిపాల్, గణిత అధ్యాపకులు కేఎస్ రమేష్ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రామానుజం చూపిన గణిత సూత్రాలే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ మొదలైన ఆధునిక ప్రపంచం మనుగడకు కూడ వారు తెలిపిన అభ్యసనాలే నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో జేఆర్‌సీ ప్రిన్సిపాల్ జూటూరి వెంకటేశ్వర్లు, విశ్వ భారతి డిగ్రీ కళాశాల డైరెక్టర్ జల్లా తిరుపతిరావు, అమ్మాజి కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డప్పు కళాకారుల సంఘం, ఇతర నేతలు

జగ్గయ్యపేట అర్బన్: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా డప్పు కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు పెన్షన్ అందజేయాలని డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కుటుంబరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని డీవీఆర్ నగర్‌లో ఉన్న సుందరయ్య భవన్‌లో ఆదివారం పేట మండలం డప్పు కళాకారుల సంఘం సమావేశం కేవీపీఎస్ నేత జె.వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి కుటుంబరావు మాట్లాడుతూ డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేయాలని, ఉన్న పెన్షన్‌ను వివిధ కారణాలతో తొలగించరాదని, అర్హులకు స్థలాలు ఇచ్చి, ఇళ్లు కట్టించి ఇవ్వాలని, గ్రూపుల వారీగా ప్రయాణ సౌకర్యం కోసం వాహనాలను ఇవ్వాలని, రైలు, ఆర్టీసీ ప్రయాణంలో రాయితీ కల్పించాలని కోరారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానించేలా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక రైతుబజారు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్.శ్రీనివాస్, ఐద్వా నాయకురాలు సోమోజు నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోట కృష్ణ, సీఐటీయూ నాయకులు దాసరి నాగేశ్వరరావు, డప్పు కళాకారుల సంఘం మండల కార్యదర్శి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్యూలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త

పట్టాలు లేక రాళ్లపైనే భవానీల నడక

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కొండ దిగువన క్యూలైన్లలో సరైన నిర్వహణ లేక దీక్ష విరమణలకు విచ్చేసిన భవానీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం దుర్గగుడి టోల్‌గేట్ నుంచి రథం సెంటర్ వరకు క్యూలో ఎక్కడ చూసినా తాగి పడేసిన ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ కనిపించాయి. ముఖ్యంగా టోల్‌గేట్ సమీపంలోని కేశఖండన శాల వద్ద ప్లాస్టిక్ బాటిల్స్‌ను తొలగించేందుకు శానిటేషన్ సిబ్బంది మచ్చుకైనా కనిపించలేదు. ఇక్కడ పారిశుద్ధ్య పనుల కోసం కార్పొరేషన్ కాంట్రాక్టు కార్మికులను నియమించింది. ఉదయం, సాయంత్రం ఒక్కరే విధులు నిర్వహిస్తుండటంతో పనులు సక్రమంగా జరగడం లేదని తెలుస్తోంది. ఇక్కడ వాటర్ బాటిల్స్‌పై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించే వారు లేకపోవడం గమనార్హం. మరో వైపు చైనా వాల్ నుంచి టోల్‌గేట్ వరకు క్యూలో భవానీలు నడవడానికి కార్పెట్లు ఏర్పాటు చేశారు. అవి ఎక్కడా సక్రమంగా లేవు. దీంతో భవానీలు, భక్తులు రాళ్లపైనే నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీక్ష విరమణలకు విచ్చేసే భవానీల కోసం దుర్గగుడి దేవస్థానం రూ. లక్షలు వెచ్చించి క్యూలైన్లు, కార్పెట్లు వేసేందుకు కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించింది. దీక్ష విరమణలలో అత్యంత కీలకమైన చివరి మూడు రోజులైనా క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని భవానీలు కోరుతున్నారు.

మరింత అప్రమత్తం

దుర్గగుడి ఈఓ. రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్ష విరమణల్లో అత్యంత కీలకమైన చివరి మూడు రోజులు అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు ఆదేశించారు. దుర్గగుడికి చెందిన కీలక విభాగాల అధికారులతో ఈవో రామరావు ఆదివారం రాత్రి సమీక్ష నిర్వహించారు. మహ మండపం నాలుగో అంతస్తులోని ఈవో చాంబర్‌లో ప్రత్యేకంగా సమావేశమై దీక్ష విరమణలపై చర్చించారు. ఆదివారం రాత్రి, సోమవారం, బుధవారం భవానీలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇప్పటికే దేవస్థానం చేసిన ఏర్పాట్లు, సదుపాయాలపై భవానీలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. చివరి మూడు రోజులు అన్ని విభాగాలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా అమ్మవారి దర్శనంతో పాటు అన్న ప్రసాదం, ఇరుముడులు సమర్పించే కౌంటర్లు, లడ్డూ ప్రసాదాలు, తలనీలాలు సమర్పించే చోట 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి చర్యలు



నందిగామ టౌన్: పారిశుద్ధ్య సమస్య పరిష్కారమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణబాబు చెప్పారు. పట్టణంలో రథం సెంటర్ సమీపంలోని కూరగాయల మార్కెట్, రామన్నపేట రోడ్డులో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయిన్లలో చెత్తాచెదారం వేయడంతో మురుగు నీటి పారుదలకు ఆటంకం కలుగుతందన్నారు. వ్యాపారులు వ్యర్థాలను డ్రెయిన్లలో కాకుండా విధిగా చెత్త కుండీల్లో వేయాలని తెలిపారు. రామన్నపేట రోడ్డులోని చెత్తను తక్షణమే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా విద్యాభివృద్ధికి 'వాగ్దేవి' కృషి



జగ్గయ్యపేట అర్బన్: మహిళల కోసం ప్రత్యేకంగా కళాశాల ఏర్పాటు చేసి 15 ఏళ్లుగా మహిళా విద్యాభివృద్ధికి వాగ్దేవి మహిళా కళాశాల యాజమాన్యం చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. స్థానిక వాగ్దేవి మహిళా కళాశాల 15వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక ఎస్‌వీఎస్ కళ్యాణమండపంలో జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా విద్యార్థులకు ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌తోనే ఉన్నత విద్యను అందిస్తూ రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి ర్యాంకులను సాధిస్తూ ప్రగతిపథంలో పయనించేలా చేస్తున్నందుకు కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీలో స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు. ప్రిన్సిపాల్ బుస్సా సురేష్, కరస్పాండెంట్ సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ వసతి ఏర్పాటుకు చర్యలు


విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు పాయింట్లు గుర్తిస్తున్న ఏఈ వెంకన్నబాబు


మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడులోని లంక భూముల్లో విద్యుత్ సదుపాయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఏఈ వెంకన్నబాబు అన్నారు. మూలపాడు ఆదిమవాస లంబాడీ ఫీల్డ్ కో-ఆపరేటివ్ సొసైటీ భూముల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. స్తంభాల ఏర్పాటుకు పాయింట్లను గుర్తించారు. సొసైటీ అధ్యక్షుడు బాణావత్ బాలాజీ సభ్యుల పేర్లతో విద్యుత్ శాఖకు పెట్టిన అర్జీలు, చెల్లించిన నగదు డిపాజిట్ చలానాలను ఏఈ పరిశీలించారు. లంక పొలాల్లో నూతన సర్వీసులు, విద్యుత్ లోడును బట్టి ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు, విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తామన్నారు. సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తజన సందడి


తిరుపతమ్మ ఆలయంలో భక్తులు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో ఆలయ క్యూలు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జామునుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేదదీరారు.


సర్వీస్ రోడ్డుపై మురుగు నీరు


గ్రామంలో రోడ్డుకు రెండువైపులా డ్రెయిన్


అనుమంచిపల్లిలో డ్రెయిన్ నుంచి రోడ్డుపైకి వస్తున్న మురుగు నీరు

అధ్వానంగా అండర్ పాస్

- పూడిక తీయక పొంగుతున్న డ్రెయిన్లు
- పట్టించుకోని జాతీయ రహదారి అధికారులు

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): గ్రామంలోని జాతీయ రహదారిపై ఉన్న అండర్ పాస్ రహదారి మురుగు నీటితో అధ్వానంగా మారింది. జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధిలో భాగంగా జాతీయ రహదారుల అధికారులు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి అండర్‌పాస్ నిర్మించారు. దీనికి రెండు వైపులా డ్రెయిన్లు నిర్మించారు. వీటిలో పూడిక తీయకపోవటంతో సర్వీస్ రోడ్లపైకి మురుగు నీరు చేరుతోంది. పరిసర ప్రాంత ప్రజలు దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు డ్రెయిన్‌లు పూడిక తీసేందుకు యత్నించినా వాటిపై ఏర్పాటు చేసిన బ్లాక్‌లు తొలగించలేక పూడిక తీత పనులు నిలిపివేశారు. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు స్పందించి గ్రామంలోని జాతీయ రహదారిపై ఇరుపక్కలా ఉన్న డ్రెయిన్లలో పూడిక తీసి మురుగు పారుదలకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.